

నృత్యం చేస్తున్న కళాకారిణులు

అలరించిన కూచిపూడి నృత్యం

మాదాపూర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): " గాంధీ శిల్ప బజార్ " హస్త కళా మేళా ప్రదర్శనలో భాగంగా బుధవారం నటరాజ కూచిపూడి డాన్స్ అకాడమీ సుప్రియ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిల్పారామంలో ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్, డెవలప్మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్, మినిస్ట్రీ అఫ్ఫ టెక్స్‌టైల్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఈ మేళా నిర్వహిస్తున్నది. కార్పెట్స్, ఖాదీ దుస్తులు, కలంకారీ, గొల్లభామ, పోచంపల్లి, గద్వాల్, వెంకటగిరి చీరలు, మెటల్ క్రాఫ్ట్, లెతెర్ క్రాఫ్ట్, మధుబని పెయింటింగ్స్, బొబ్బిన్ లేస్ వర్క్స్, ఇంకా మరెన్నో వివిధ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.



ప్రదర్శనలో కోయల్ చందక్

డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను.. సోషలైట్ కోయల్ చందక్ బుధవారం ప్రారంభించారు. జూబ్లీహిల్స్‌లోని రోడ్ నంబర్ 1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్నారు. విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారుడికి అందించేందుకు ఏర్పాటైన ప్రదర్శనను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 23 వరకూ కొనసాగుతున్న ప్రదర్శనలో సంప్రదాయ వస్త్రాలు, చేతితో తయారు చేసిన ప్రత్యేక వస్త్రోత్పుల కలెక్షన్ వేదికగా పటాన్ పటోలా, బంధాని, బనారసీ, పైథాని, కాశ్మీరీ, మహేశ్వరి, కాంచీపురం, గద్వాల్, లక్నోవి, అజ్రాక్ చీరలు, సూట్లు, కుర్తీలు, డ్రెస్ మెటీరియల్, ఆభరణాలు, బెడ్‌షీట్‌లు వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యం అని తెలిపారు.

● మర్యాదపూర్వక కలయిక



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో శ్రీనగర్‌కాలనీ బాధ్యతలు చేపట్టి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కాలనీ వాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో శ్రీనగర్‌కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి సాయి ప్రసాద్ ఉన్నారు.

-బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి)

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

● నో పార్కింగ్ బోర్డు వద్ద ఫొటోలు తీస్తుండగా..

బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నో పార్కింగ్ బోర్డు వద్ద తన బైక్ ఫొటో తీస్తున్నాడని ట్రాఫిక్ కానిస్టెబుల్‌పై యువకుడు దాడి చేశాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన సాయి మనోహర్ బంజారాహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్. ఇదే ప్రాంతం రోడ్ నంబర్ 12లో సయ్యద్‌నగర్‌కు చెందిన ఇబ్రహీం నోపార్కింగ్ బోర్డు ఉన్న ప్రదేశంలో బైక్ నిలిపాడు. గమనించిన సాయి.. ఈ బైక్ ఫొటో తీశాడు. దీంతో ఆగ్రహించిన ఇబ్రహీం, కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగాడు. దురుసుగా ప్రవర్తించి తోసేశాడు. సాయి మనోహర్ కింద పడటంతో గాయాలపాలయ్యాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపై కేసు నమోదు చేసుకొని బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ ఎస్‌ఆర్టీ నగర్, బంజారా నగర్, స్వరాజ్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ ఆర్బీఐ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ మహాత్మా నగర్, హిందూ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆరోగ్య.. భద్రతా కార్డు!

పోషకాలతో కూడిన రేషన్‌బియ్యం

- ఐరన్‌తో రక్తహీనతకు స్వస్తి
- ఫోలిక్ యాసిడ్‌తో ఎర్ర రక్తకణాల ఉత్పత్తి
- మెజారిటీ లబ్ధిదారులు సన్న బియ్యం తింటున్నారంటున్న సివిల్ సప్లయ్ అధికారి
- సర్కిల్ 7లో లక్ష దాటిన కార్డులు



గతంలో కార్డుల సంఖ్య	83,013
ప్రస్తుతం కార్డుల సంఖ్య	1,00,382
రేషన్‌కార్డులున్న కుటుంబ సభ్యుల సంఖ్య	3,57,761
ఉచిత బియ్యం పంపిణీ (కిలోలు)	22,66,826



సర్కిల్ 7 పౌర సరఫరాల శాఖ కార్యాలయం

ఖైరతాబాద్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఆహార.. భద్రతా కార్డు కాదు ఆరోగ్య.. భద్రతా కార్డు అనే అభిప్రాయం లబ్ధిదారుల్లో వ్యక్తం అవుతోంది. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో విలువైన పోషకాలున్నాయని సివిల్ సప్లయ్ అధికారి అంటున్నారు. ఖైరతాబాద్ (సర్కిల్ 7)లో ఒకేసారి 17 వేలకు పైగా ఆహార భద్రతా కార్డులు పెరగగా ప్రస్తుతం ఈ కార్డుల సంఖ్య లక్ష దాటింది. ఆ మేరకు కథనం..

80 శాతం తగ్గిన బ్లాక్ విక్రయాలు.. కేసులు..

గతంలో ఆహార భద్రతా కార్డులపై లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. నగరాల్లో 90 శాతం మంది బ్లాక్‌లో విక్రయించేవారు. ప్రస్తుతం పోషకాలతో ఉన్న సన్నబియ్యం ఇస్తుండడంతో రేషన్‌కార్డులపై వస్తున్న బియ్యాన్ని చాలా మంది స్వయంగా ఇళ్లలో వండుకొని తింటున్నారు. మొన్నటి వరకు ప్రతీ ప్రాంతంలో రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసే బ్రోకర్లు ఉండేవారు. వీధుల్లో రేషన్ బియ్యం కొంటాం అంటూ నేరుగా వచ్చేవారు. బియ్యాన్ని బ్లాక్ చేసే వారిపై తరచుగా కేసులు నమోదయ్యేవి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. అవి 80 శాతానికి తగ్గాయని సివిల్ సప్లై అధికారులు తెలుపుతున్నారు. ఆహార భద్రతా కార్డులతో అందించే బియ్యాన్ని దిగువ మధ్యతరగతి ప్రజలే వినియోగించుకుంటున్నారని సర్కిల్ 7 సహాయ పౌర సరఫరాల శాఖ అధికారి జ్యోతి తెలిపారు.

లాభాలు ఎన్నో

"సన్న బియ్యంలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కె ఫైన్ రైస్) బియ్యంలో ఉన్న ఐరన్ ..మహిళలు, పిల్లల్లో రక్త హీనతను తగ్గిస్తుంది. ఇందులోని ఫోలిక్ యాసిడ్ (విటమిన్ బీ 9) ద్వారా కణ విభజనకు, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కీలకంగా పని చేస్తుంది. గర్భదారణ సమయంలో లోపాలు రాకుండా చేస్తుంది. దీంతో పాటు విటమిన్ బీ 12 ద్వారా నాడీ వ్యవస్థ పనితీరుకు, ఆరోగ్యకరమైన రక్త కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం ఆరోగ్య పరిరక్షణ, పోషకాలున్న ఉండటంతో చాలా మంది ఇష్టంగా తింటున్నారు." అని పౌర సరఫరాల శాఖ అధికారి తెలిపారు.

'ఏఐ'తో ఉద్యోగాల ఊస్టింగ్ అపోహే

- "స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా"గా తెలంగాణ
- మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): "స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా"గా తెలంగాణను మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో తెలంగాణ యువతను పరిశ్రమల భాగస్వామ్యంతో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారం గచ్చిబౌలిలో ఉన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీ)లో నిర్వహించిన "స్కిల్ కాన్వకేషన్ ఇన్ ఐటీ/ఐటీఈఎస్ సెక్టార్ & ఏఐ, డిజిటల్ టెక్నాలజీస్ హ్యాకథాన్ 2025"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. టెక్నాలజీ రోజురోజుకూ వేగంగా మారుతోందని, దాన్ని అందిపుచ్చుకోగలిగితేనే భవిష్యత్ అని అన్నారు. రెండేళ్లలోనే 40 శాతానికి పైగా అంతర్జాతీయ కంపెనీలు "జనరేటివ్ ఏఐ" ను తమ కోర్ వర్క్‌లో భాగం చేసుకున్నాయన్నారు. "ఏఐ" వల్ల ఉద్యోగాలు పోతాయన్నది అపోహే, అది కేవలం ఉద్యోగాల స్వరూపాన్ని మాత్రమే మారుస్తుందన్నారు. ఆటోమేషన్ వల్ల 85 మిలియన్ జాబ్స్ పోతే, కొత్తగా 97 మిలియన్ల స్కిల్ బేస్డ్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తేల్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఓ వైపు సైబర్ క్రైమ్స్ రోజురోజుకూ పెరుగుతున్నాయని, మరోవైపు ఎథికల్ హ్యాకర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు భారీ డిమాండ్ ఏర్పడుతుందన్నారు. వాతావరణ మార్పుల వల్ల క్లీన్ టెక్, ఈవీలు, గ్రీన్ ఇన్నోవేషన్ రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. "రెడీ టూ వర్క్ ఫోర్స్"ను తయారు చేసే బాధ్యతను తమ ప్రభుత్వం భుజానికి ఎత్తుకుందని వివరించారు.



సుధాకర్ పార్థీవదేహంపై పూలమాల వేసి సంతాపం తెలుపుతున్న తలసాని

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత ఆకస్మిక మృతి

● ఎమ్మెల్యే తలసాని ప్రగాఢ సంతాపం

అమీర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బుద్ధనగర్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నక్కా సుధాకర్ గౌడ్ (41) ఆకస్మికంగా మృతిచెందారు. మంగళవారం సాయంత్రం చాతీ నొప్పి రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు వచ్చి ఆయన మృతి చెందాడు. మృతి విషయం తెలుసుకొని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ శేషకుమారి, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే.. బుద్ధనగర్‌లోని ఆయన నివాసానికి బుధవారం చేరుకొని పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. తలసాని వెంట ప్రవీణ్ రెడ్డి, గొలుసుల సత్యనారాయణ, కూతురు నర్సింహ, కట్టా బలరాం, టిల్లు బాయ్, మధుసుధన్ రావు, ప్రకాష్ గౌడ్, బాబా గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.



జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పంతాక్షరీకి వినతి పత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం వాసులు

ఆ మద్యం షాపులను వేరే ప్రాంతాలకు తరలించాలి : వెల్ఫేర్ సొసైటీ

అమీర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న మద్యం దుకాణాలను వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని న్యూ ఎస్ఆర్ నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పంతాక్షరీని ఆయన కారాలయంలో సొసైటీ అధ్యక్షుడు రవికుమార్ దేవులపల్లి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్ రెడ్డి, కాంగ్రెస్ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస రావులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్ఆర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న న్యూ సోని వైన్స్ కారణంగా రహదారి పక్కన వాహనాలను పార్క్ చేసి మద్యం కొని దీని పరిసరాలు, చుట్టుపక్కలే తాగుతున్నారన్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. బాపునగర్ శ్రీలక్ష్మీ వైన్స్ సనత్‌నగర్ లోని గణేష్ వైన్స్ బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న లక్ష్మీ వైన్స్ ఎదుట కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొందన్నారు. దీంతో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్ఆర్‌నగర్ లైబ్రరీ పార్క్‌లో రాత్రి సమయంలో తాగి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన పంతాక్షరీ.. త్వరలో క్షేత్ర స్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రవికుమార్ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

అమీర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని యువతిని మోసగించాడో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ప్రియుడిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాలకు చెందిన శ్రీకాంత్ శ్రీనివాసనగర్ (ఈస్ట్)లో నివాసముంటున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నాగర్ కర్నూల్‌కు చెందిన ఓ యువతి ఉద్యోగం కోసం నగరానికి వచ్చి మధురానగర్‌లో నివాసం ఉంటోంది. ఓ కాఫీ షాపు వద్ద యువతితో పరిచయం పెంచుకున్న అతడు ప్రేమ పేరుతో నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని లోబరుకున్నాడు. ఇటీవల వేరే యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడన్న విషయం తెలుసుకుని నిలదీసేందుకు ప్రయత్నించగా తప్పించుకొని తిరుగుతున్నాడు. మోసపోయానని గుర్తించిన యువతి వెంటనే ఎస్ఆర్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని శ్రీకాంత్ ను రిమాండ్ కు తరలించారు.



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ చేతన్ పింపాల్‌ఖుటే

ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 'కోచింగ్ ది కోచ్'

బంజారాహిల్స్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ కోచింగ్ ది కోచ్ ప్రీ క్యాంపెయినింగ్ చేపట్టింది. ఆయిల్ కొనుగోలు చేసే సమయంలో ప్యాక్‌లలో ఉన్న నికర పరిమాణాన్ని వినియోగదారులు తప్పక తనిఖీ చేయాలన్నది ప్రధాన ఉద్దేశమని ఫ్రీడం ఆయిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ చేతన్ పింపాల్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో ప్రచార పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఫ్రీడమ్ ప్రతి లీటర్ పౌచ్‌లో 910 గ్రాముల నూనె ఉండేలా నిర్ధారిస్తోందన్నారు. డెసిషన్ రివ్యూ సిస్టమ్, ప్యాక్ రివ్యూ సిస్టమ్ అనే క్యాప్షన్‌తో భారత క్రికెట్ జట్టు మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం నిర్వహిస్తారన్నారు.

కాంగ్రెస్ రణభేరీ సభను బహిష్కరించాలి

పంజాగుట్ట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నిర్వహించనున్న రణభేరి సభను బహిష్కరించాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ మంత్రి నర్సింహ, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు.మాల మహానాడు అధ్యక్షుడు చెన్నయ్య నేతృత్వంలో కాంగ్రెస్ మంత్రి సహకారంతో సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించనున్నది మాలల రణభేరి సభ కాదు, మాలల మోస భేరి సభ అని అన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



వెంకట నాయుడు



యూనుస్

బోరబండ, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇంటి నుంచి వెళ్లిన ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ సంఘటనలు బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసులు తెలిపిన ప్రకారం విజేత థియేటర్ ఎదురుగా సారథి నగర్ గుడిసెల్లో నివసించే కురుపాటి వెంకట నాయుడు (66) చిన్నప్పటి నుంచి మూర్చతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం మందులు వాడుతున్నాడు. ఈ నెల 8న రాత్రి 10.30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆయన ఇంటి నుంచి వెళ్లి పోయాడు. అతడి వద్ద సెల్ ఫోన్ కూడా లేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య కురిపాటి లక్ష్మీదేవి.. బోరు బండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● బోరబండ సైట్-3 కాలనీలో షేక్ యూనుస్ (53) నివాసముంటున్నాడు. అతను వెల్డింగ్ పని చేస్తున్నాడు. గతనెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి సెల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అని వస్తోంది. పరిసర ప్రాంతాలు, బంధుమిత్రుల వద్ద వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. యూనుస్ భార్య షేక్ బీఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బోరబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తులు ఇతర విభాగాలకు బదిలీ చేయొద్దు

● జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు బీజేపీ కార్పొరేటర్ల వినతి



లేఖను అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఆస్తులు ఇతర విభాగాలకు బదిలి చేయొద్దని, సర్వసభ్య సమావేశానికి అడిషనల్ కలెక్టర్లను, హెచ్ఎండీఏ అధికారులను పిలవాలని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ శంకర్‌యాదవ్, బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అనేక జీహెచ్‌ఎంసీ ఆస్తులను పలు ప్రభుత్వ శాఖలకు అప్పగిస్తే జీహెచ్‌ఎంసీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ గ్రౌండ్స్ నుంచి ఆదాయం వస్తున్నా గానీ ప్రభుత్వంలో ఉన్నటువంటి ఇతర శాఖలకు అప్పగిస్తే జీహెచ్‌ఎంసీ ఆదాయం కోల్పోతుందన్నారు. పలు సమస్యలు చర్చించేందుకు సంబంధిత శాఖలను కౌన్సిల్ సమావేశానికి పిలిపించాలని శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆ మేరకు రాసిన లేఖను బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధానకార్యాలయంలో కమిషనర్ కర్ణన్‌కు జీహెచ్‌ఎంసీ బీజేపీ మీడియా ఇన్‌చార్జి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అందజేశారు.



ప్రపంచ బస్టాప్ వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకురాలు హబీబా సుల్తానా



ఎస్పీఆర్ హిల్స్‌లో నివాళి అర్పిస్తున్న రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి



రహ్మత్ నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్

ప్రగతిపథం.. ఇందిర దార్శనికతకు నిదర్శనం

● మాజీ ప్రధానికి ఘననివాళి

బోరబండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విప్లవాత్మక సంస్కరణలతో దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన దార్శనికురాలు, ఇందిరాగాంధీ అని మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా అన్నారు. ఇందిర జయంతి సందర్భంగా బోరబండ బస్టాపు వద్ద ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. వినాయకరావు నగర్ బస్తీ అధ్యక్షుడు ఆనంద్, గోగుల్ల వెంకటేశ్, సురేందర్, శంకర్, పద్మరావు, బాలరాజు గౌడ్, చెట్టి దేవేందర్, రజాక్, సుధాకర్ రెడ్డి, దశమంత్ రెడ్డి, ఎజాస్ బేగ్, సాజిద్, సన్నరాజుల వెంకటేశ్, రంగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్లలో బుధవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్పీఆర్ హిల్స్ లోని ఇందిర విగ్రహానికి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.





ఎర్రగడ్డ ఆనంద్ నగర్ చౌరస్తాలో ఇందిరా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , మెషిన్ ఖురేషి, ఎర్ర కృష్ణ కుమార్, పి.ఆకాశ్, దీపక్ కాంబ్లీ, ఖాజా పాషా పాల్గొన్నారు.

● ఎర్రగడ్డలోనే నిర్వహించిన ఓ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ రమేష్‌నాయక్, నాయకులు రవిగౌడ్, మోసిన్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి)

పగిడీలు పెట్టి.. జ్ఞాపకాలు తట్టి!

● పురుషుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థినులు



పగిడీలు ధరించిన స్నేహితులతో పూర్వవిద్యార్థినులు

ఖైరతాబాద్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థినులు (1979-80వ బ్యాచ్).. తోటి విద్యార్థులకు పగిడీలు పెట్టి శాలువాలతో సత్కరించి బహుమతులను అందజేశారు. మెన్స్ డేను ఘనంగా నిర్వహించారు. బుధవారం లకిడీకపుల్‌లోని ఎస్ ఎస్ఆర్ చాంబర్స్‌లో క్లాస్ మెట్స్ కు మరచిపోలేని అనుభూతిని మిగిల్చారు. తరువాత నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సరదాగా గడిపారు. అందరూ మహిళల దినోత్సవాన్ని ఘనంగా జరుపుతారని, తాము వినూత్నంగా పురుషుల దినోత్సవాన్ని చదువుకున్న స్నేహితులతో జరుపుకున్నామని పూర్వ విద్యార్థినులు పద్మావతి, శాంత, సత్య, శైలజ, విజయ, ఇందిర, సంధ్య, సరయులు తెలిపారు



బచన్‌రాజును కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

● అందుకే హస్తం పార్టీలో చేరికలు: శ్రీగణేశ్

సికింద్రాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని విశ్వసిస్తున్న పలువురు హస్తం పార్టీలో చేరుతున్నారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ అన్నారు. బోయినపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బచన్ రాజు, ఆయన అనుచరులు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అద్భుత పనితీరు చూసి ఇతర పార్టీల నాయకులు, తటస్థులు హస్తం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని, వారందరినీ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న జలమండలి డీపీఎం విద్యాసాగర్‌తో పాటు అధికారులు

డ్రైనేజీ పైప్‌లైన్ మార్చాలి : గాజుల సౌందర్య

అడ్డగుట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న మజీద్ నుంచి తుకారాంగేట్ నందానార్‌నగర్ వరకు డ్రైనేజీ పొంగి ఏరులై పారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. బుధవారం ఆమె సమస్య ఉన్న ప్రాంతానికి మారేడుపల్లి జలమండలి డిప్యూటీ జనరల్ మనేజర్ విద్యాసాగర్, ఏఈ ప్రవంతితో పాటు జీహెచ్ఎంసీ ఏఈ అశీష్ కుమార్, సూపర్‌వైజర్ సలీం, అధికారులను పిలిపించి సమస్యను చూపించారు. చిన్న డ్రైనేజీ పైప్‌లైన్ కారణంగా నిత్యం మ్యాన్‌హోల్ నుంచి మురుగు ప్రవహిస్తుందని, చిన్న పైప్‌లైన్ తొలగించి నాలుగు లేదంటే ఐదు ఇంచుల పైప్‌లైన్ వేసి సమస్య పరిష్కారమయ్యేవిధంగా చూడాలని అధికారులకు సూచించారు. పెద్ద పైప్‌లైన్ కోసం ఎస్టిమేషన్ వేయాలని, అందుకయ్యే నిధులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తెప్పిస్తామని ఆమె అధికారులను తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు హంసరాజు, నరేందర్, నందులు పాల్గొన్నారు.



వారాసిగూడ కుశాల్ జ్యువెలర్స్ ఎదురుగా గల్లీలో పేరుకుపోయిన చెత్త

అంతర్గత రోడ్లలో పారిశుధ్య నిర్వహణ శూన్యం

బౌద్ధనగర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్లోని పలు ప్రాంతాల్లో అంతర్గత రోడ్లలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే జరుగుతుంది. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోవటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారాసిగూడ కుశాల్ జ్యువెలర్స్ ఎదురుగా ఉన్న వీధిలో ఐదురోజుల నుంచి రోడ్లపై చెత్తకుప్పలు దర్శనం ఇస్తున్నా వాటిని తొలగించకపోవటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మహ్మద్‌గూడ, బ్రాహ్మణబస్తీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీ పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు సవ్యంగా సాగటం లేదని, ఎప్పటికప్పుడు పనులు జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.



బోయినపల్లి పెన్షన్ లైన్‌లో కబ్జాకు గురైన రహదారి

రహదారి ఆక్రమణ

బోయినపల్లి, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు ఒకటో వార్డు పరిధిలోని పెన్షన్ లైన్‌లోని రహదారిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. అయినప్పటికీ ఇంత బహిరంగంగా రహదారిని మూసివేసి అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంలోని అంతర్యం ఏమిటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎంతో విలువైన ఈ రహదారిని కబ్జాదారుల కోరల నుంచి కాపాడి ప్రజలకు ఉపయోగపడేవిధంగా పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ!

కంటోన్మెంట్ ప్రజలకు తీరనున్న కష్టాలు

సికింద్రాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్మిస్తున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల పుణ్యాన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని పలు రోడ్లకు మహర్దశ లభించనుంది. కొన్ని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లకు మోక్షం కలుగబోతోంది. ఫలితంగా అధ్వాన రోడ్లతో ప్రజలు పడుతున్న అవస్థలు తీరనున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని రహదారుల మీదుగా ప్రభుత్వం రెండు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని నిర్ణయించిన సంగతి విదితమే. ప్రభుత్వం ఇటీవల ప్యారడైజ్-సుచిత్ర ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభించింది. కాగా కారిడార్ నిర్మాణ పనులు మొదలు కావడంతో ప్యారడైజ్ బాలంరాయి-బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం జంక్షన్ మధ్య ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మార్గంలో కొద్ది రోజులుగా వన్ వే అమలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని మార్గాల్లో ట్రాఫిక్ నిబంధనలు ప్రవేశపెట్టి, ఇతర మార్గాల వైపునకు వాహనాల రాకపోకలను మళ్లించారు. దాంతో బాలంరాయి, తాడ్‌బండ్, సిక్‌విలేజీ, మడ్‌ఫోర్టు, బోయినపల్లి, మారేడుపల్లి పరిసరాల్లోని పలు అంతర్గత రోడ్లలో ట్రాఫిక్ ఒత్తిడి పెరిగింది.

ప్రజల అవస్థలు

డైమండ్ పాయింట్-కంటోన్మెంట్ వర్క్‌షాప్, సెంటర్ పాయింట్, బాపూజీనగర్, మాతాజీనగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లు మరీ అధ్వానంగా ఉండడంతో ఏక్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. కాగా గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని, గుంతలను పూడ్చాలని స్థానికులు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం కలగడం లేదు.

అధికారులకు తట్టిన ఐడియా

కాగా ప్రజల నుంచి ఫిర్యాదులు అధికమవుతుండడంతో కంటోన్మెంట్ బోర్డు అధికారులకు కొత్త ఐడియా తట్టింది. వెంటనే దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం వలన ట్రాఫిక్‌ను మళ్లించవలసి వస్తోందని, ఫలితంగా అంతర్గత రోడ్లపై ఒత్తిడి బాగా పెరుగుతోందని, ఈ రోడ్లు గుంతలమయంగా ఉండడంతో పలు ఇబ్బందులు కలుగుతున్నాయని హెచ్ఎండీఏకు లేఖ రాశారు. అందుకే అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టడం, గుంతలను పూడ్చడం తదితర పనులను హెచ్ఎండీఏ నిర్వహించాలని కోరారు. అందుకే హెచ్ఎండీఏ నుంచి కూడా సానుకూలత వ్యక్తమైనట్టు తెలిసింది. హెచ్ఎండీఏ అధికారికంగా ఈ పనులు చేపడితే కంటోన్మెంట్‌లోని పలు అంతర్గత రోడ్లకు మహర్దశ లభించినట్టేనని చెప్పవచ్చు.

మూడు రోడ్లకు వర్క్ టెండర్లు సిద్ధం

కాగా మూడు ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాటికి సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం నిర్ణయించింది. వెస్ట్ మారేడుపల్లితోపాటు మరో రెండు ప్రధాన రోడ్ల సైతం గుంతలమయంగా మారడం, వీటిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో వీటి మరమ్మతుల కోసం వర్క్ ఆర్డర్లు సైతం అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఈ రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని కసరత్తు చేస్తున్నారు.



వెస్ట్ మారేడుపల్లి రోడ్డు



బోయినపల్లిలోని అంతర్గత రోడ్డు





బోయినపల్లి శివ గణపతి ఆలయంలో మాస శివరాత్రి పూజలు చేస్తున్న భక్తులు

దేదీప్యమానంగా కార్తీక దీపోత్సవం

బోయినపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని బోయినపల్లిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శివ పార్వతుల పల్లకి సేవలు, దీపోత్సవాలు వైభవంగా జరిగాయి. బోయినపల్లి శివ ఎన్‌క్లేవ్, సాయి పద్మజ కాలనీలోని శివ గణపతి ఆలయంలో కూడా భక్తులు పూజలు చేశారు. పల్లకి సేవ జరుగుతున్న సమయంలో ఓం నమఃశివాయ, హరహర మహాదేవ నామస్మరణలతో కాలనీ మారు మోగింది. అనంతరం ఆలయం వద్ద అనెం సాయిరామ్, ఈశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తులసీదాస్, విక్రమ్ మల్లిఖార్జున, హనుమంత్ రెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహాకాళి ఆలయ ట్రస్టు బోర్డుకు దరఖాస్తుల ఆహ్వానం

సికింద్రాబాద్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి ఆలయానికి ట్రస్టు బోర్డును నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడు సంవత్సరాల విరామం తర్వాత ఈ నియామకంపై దేవాదాయ శాఖ కసరత్తు ప్రారంభించింది. వరుసగా మూడు సంవత్సరాలు మహాకాళి బోనాల జాతరను పురస్కరించుకుని ఉత్సవ కమిటీని నియమించి బోనాల జాతర నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలు ఉత్సవ కమిటీతోనే నెగ్గుకు వచ్చింది. కాగా ఎట్టకేలకు ఆలయానికి ట్రస్టు బోర్డును నియమించాలని నిర్ణయించడం, దీనికి అనుగుణంగా దేవాదాయశాఖ తాజాగా నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. ట్రస్టు బోర్డులో సభ్యులుగా అమ్మవారికి సేవలందించాలని ఆసక్తి ఉన్న అభ్యర్థులు 19 డిసెంబర్ 3వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి సూచించారు. వివరాలు ఆలయ కార్యాలయంలో లభిస్తాయని, దరఖాస్తు పత్రాలను ఆలయంలో పొందవచ్చని ఆయన తెలిపారు.



ఉజ్జయినీ మహాకాళి ఆలయం

ఉన్నత లక్ష్యాల వైపు అడుగేయండి: ఆకునూరి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, ధైర్యంగా ముందడుగు వేయాలని విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి విద్యార్థులకు సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఎంఏ మొదటి సంవత్సర విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఇండక్షన్ కార్యక్రమం-2025లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామర్థ్యం ఏ నేపథ్యంలోని విద్యార్థుల్లోనైనా ఉంటుందని, యువత దేశ భవిష్యత్తులో చాలా కీలకమని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతో ప్రయోజనం పొందాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం సూచించారు. విద్యార్థులకు అకడమిక్ వాతావరణం, విభాగాధిపతుల కార్యకలాపాలు, సహాయక వ్యవస్థలు, కళాశాల మొత్తం లక్ష్యాలను అవగాహన కల్పించడం కోసం ఈ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించామని తెలిపారు. గౌరవ అతిథి సి.హెచ్. వేణుగోపాల్ రెడ్డి ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పటి తన జ్ఞాపకాలను పంచుకున్నారు. అంకితభావం, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా.కొండ నాగేశ్వర రావు, డా.కె.బాలు నాయక్, సోషల్ సైన్సెస్ డీన్ బి.సుధాకర్ రెడ్డి, విభాగాల అధిపతులు, అకడమిక్ కోఆర్డినేటర్ డా.పి.స్వాతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సి.ఎస్.స్వాతి, డిప్యూటీ రిజిస్ట్రార్ కె.ఎ.సామ్సన్, పి.లింగారెడ్డి, 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూ అభివృద్ధి హామీని సీఎం నిలబెట్టుకోవాలి

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం సైన్స్ కాలేజ్ నుంచి ఆర్ట్స్ కాలేజ్ వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్, ఓయూ ప్రెసిడెంట్ కె.స్వాతి మాట్లాడుతూ.. ఓయూ విద్యార్థులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ, ప్రభుత్వాలు మారినా సమస్యలు మాత్రం మారడంలేదన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసి స్టూడెంట్ ఎజెండా రూపొందించామని, దానిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓయూలో మెస్ డిపాజిట్ల పేరిట ముందస్తు వసూళ్లను రద్దు చేయాలని, ఉచిత మెస్ వసతి కల్పించాలని కోరారు. విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు, రీసెర్చ్ స్కాలర్లకు సీఎం ఫెలోషిప్ ఇవ్వాలన్నారు. స్కాలర్‌షిప్‌లను రెట్టింపు చేయాలి, కోర్సు, పరీక్షా ఫీజులు తగ్గించాలని పేర్కొన్నారు. టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, స్టూడెంట్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం దశల వారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, కార్యదర్శి ఎస్.అంజి, ఓయూ నాయకులు క్రాంతి, తిరుపతి, మధు, విజయ్, మేనక, గాయత్రి, రమ్య, సింధు, వర్షిణి, బాలకృష్ణ, పవన్, అక్బర్, నితిన్, సతీష్, లోకేష్, సదానందం, భానుప్రకాశ్, నూతన్, అశోక్, కార్తీక్, చందు, వినీల్, హర్షిణి, స్వప్న, ప్రణీత, నవ్య విద్యార్థులు నాయకులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బౌద్ధనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మల తొలగింపు, కేబుల్‌లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యానగర్ ఏఈ రోచిత తెలిపారు. ఎల్ఎస్ నగర్ ఫీడర్ పరిధిలో ఎల్.నారాయణనగర్, వారాసిగూడ, న్యూఅశోక్‌నగర్ నాలా, అంబర్‌నగర్, పార్శీగుట్ట వైఎస్సార్ పార్కు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.



దెబ్బతిన్న అంతర్గత రహదారులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి

● డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తార్నాక డివిజన్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఫుట్‌పాత్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బస్తీ బాటలో భాగంగా బుధవారం తార్నాకలోని పలు కాలనీల్లో పాదయాత్ర చేపట్టిన డిప్యూటీ మేయర్ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న అంతర్గత రహదారులు, మురుగు నీటి సమస్య, విద్యుత్ స్తంభాలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డితో పాటు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన అతిథులు

అయ్యప్ప స్వాములకు అన్నదానం

చిలకలగూడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంజనీపుత్ర భక్త సమాజ ప్రభుస్వామి ఆధ్వర్యంలో చిలకలగూడ రైల్వే కాలనీలోని మావురాల రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాములకు మండల కాలం పాటు జరిగే అన్నదాన ప్రారంభోత్సవ కార్యక్రమంలో దిశ కమిటీ మెంబర్ యు.శరదా మల్లేశ్, బీజేపీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు ఆదర్శ ముదిరాజ్, గురుదాస్, చోటప్రభు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

మారేడుపల్లి ఎంఆర్ఓ మహమ్మద్ అసదుల్లాఖన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు ఏ.ఆర్.కృష్ణ, పి.ఆర్.జయప్రకాశ్, శ్రీకాంత్, ఈ.బాలమల్లేశ్

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

రాత్రి సమయంలో పెట్రోలింగ్ ఏర్పాటు చేయండి

అడ్డగుట్ట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న టైపిస్టుల అడ్డా సాయంత్రం అయిందంటే బార్లుగా మారుతున్నాయి. వీటిని సాయంత్రం ఐదు గంటలకు మూసి వేయాల్సి ఉండగా మధ్యరాత్రి వరకు తెరిచి ఉంటున్నాయి. ఇక్కడ కొందరు మద్యం సేవిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నారని కాలనీవాసులు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్‌లకు పోస్టులో లేఖ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయంలో ఇటువైపు రావాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని కొందరు కాలనీ వాసులు తెలిపారు. గతంలో మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా అసాంఘిక కార్యకలపాలు కొనసాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో టైపిస్టుల అడ్డా వద్ద పెట్రోలింగ్ చేయాలని కోరుతున్నారు.

మహిళ అదృశ్యం



జానకి

బౌద్ధనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసనగర్ బండమైసమ్మ ఆలయ ప్రాంతానికి చెందిన చెందిన జి.జానకి(55)కి కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్థాపానికి గురైన ఆమె 17న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో తన తల్లి కనిపించటం లేదని కుమారుడు గట్టు సుమంత్ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్, మల్లికార్జున్ తదితరులు



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు

రామ్‌గోపాల్‌పేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రామ్‌గోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు దుండిగల్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీవీ మార్గ్‌లోని అంబేద్కర్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద ఇందిరాగాంధీ నూతన విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని జాతికి ఎంతో మేలు చేశారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.మహేశ్‌కుమార్, నాగరాజు, రఘు ముదిరాజ్, ప్రేమసాగర్, విశాల్, మనీషా, విష్ణు, ఉషారాణి పాల్గొన్నారు.



బోయినపల్లిలోని పంపుహౌస్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మారేడుపల్లిలో..

మారేడుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీ 108 వ జయంతిని పురస్కరించుకుని పికెట్ జేబీఎస్ ఎదురుగా ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొల్లారం డౌటన్ బజార్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి నర్సింహన్, జీవి.బాలరాజ్, సతీష్, రషీద్ తదితరులు



తుకారాంగేట్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ తదితరులు